క్లుప్తంగా

నేడు ఆస్పరిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆస్పరి: ఆస్పరిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారన్నారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. ప్రభుత్వం అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి 33వ ఆరాధనోత్సవాల సందర్భంగా సోమవారం రెండు తెలుగు రాష్ట్రాల వారికి భజన పోటీలు నిర్వహించునున్నట్లు ఆదివారం గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా అర తులం బంగారం, తర్వాతి స్థానాల వారికి వెండి 30 తులాలు, 25 తులాలు, 20, 15, 12, 11, 10, 9, 8, 5 తులాలు చొప్పున అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 98492 81708, 90003 71857 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

గోనెగండ్ల: గాజులదిన్నె, గంజిహళ్లి గ్రామాల్లో సోమవారం ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఉంటాయని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోందని తెలిపారు. అలాగే 24న పుట్టపాశం, బి.అగ్రహారం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయని వెల్లడించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో చిరంజీవి కంటి హస్పిటల్ ఆధ్వర్యంలో, అలాగే బోడబండ గ్రామంలో స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కంటి వైద్యులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ నాగవంశీకృష్ణ మాట్లాడుతూ.. కంటి సమస్యలను ఆజాగ్రత్త చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కంటి చూపుపోతే జీవితం అంధకారమేనన్నారు. ఆయా శిబిరాల్లో పెద్ద సంఖ్యలో గ్రామీణులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

వేలం ద్వారా రూ.2.67 లక్షల ఆదాయం

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయలు అమ్ముకునేందుకు హక్కుల వేలం ఆదివారం నిర్వహించగా రూ.2.67 లక్షలు పలికింది. దర్గాలో నిర్వహించిన వేలంలో 7 మంది పాటదారులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. చివరకు ఆదోనికి చెందిన తాహెర్ బాషా రూ. 2.67 లక్షలకు హెచ్చు పాడి ఈ సంవత్సరం టెంకాయలు అమ్ముకునేందుకు హక్కులు దక్కించుకున్నారు. గతేడాది వేలం రూ.2.24 లక్షలు పలకగా ప్రస్తుతం రూ.43 వేలు అదనంగా ఆదాయం లభించింది. గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, క్రిష్ణమూర్తి, మల్లికార్జునరెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, చిన్నాయప్ప పాల్గొన్నారు.

24 నుంచి వాలీబాల్ పోటీలు

ఆస్పరి: మండలంలోని యాటకల్లులో వెలసిన సుంకులమ్మవ్వ ఊరు దేవర సందర్భంగా ఈనెల 24, 25 తేదీలలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించునున్నట్లు ఆ సంఘం మండల కార్యదర్శి రమేష్ ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 8,016, రెండో బహుమతి రూ. 6,016, మూడో బహుమతి రూ.3,016 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు సోమవారంలోపు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 62819 71243 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జయనాగేశ్వర రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఎమ్మిగనూరురూరల్: మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానంటూ ప్రకటించిన జయనాగేశ్వరరెడ్డి, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో ఎందుకు విగ్రహం ఏర్పాటు చేయలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఆర్.మురహర రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పలువురు ఆ పార్టీలో చేరగా మురహర రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతిపక్షం పార్టీ లేకుండా పోయిందని ఆరోపించారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ప్రస్తుతం పార్టీలో చీడపురుగులు లేరని, ఉన్నవారి మీద ఒక్క వేటు పడని వ్వనని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను విస్మరించడమే కాకుండా వారి పట్ల చులకనగా మాట్లాడటం తగదన్నారు. పార్టీలోకి పట్టణంలోని 7, 9, 14, 16, 19 వార్డులతో పాటు పెద్దనెలటూరు, ఎనగండ్ల, గాజులదిన్నె నుంచి పలువురు కార్యకర్తలు చేరారు. ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సుధానాయుడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

ఆలూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం ఆస్పరి మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. ఈ సందర్భం బైలుపత్తికొండ గ్రామంలో సుంకులమ్మ ఆలయం నిర్మాణానికి మంత్రి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, సచివాలయాలకు మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని వారికి సూచించారు. పనులు నాణ్యతతో చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాయకులు నారాయణస్వామి, సర్పంచ్ బీటీ రంగన్న, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు విధానంలోకి మార్చండి

రాష్ట్ర బీమా వైద్య (ఈఎస్ఐ) శాఖ ఏపీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సింగ్, పారా మెడికల్ ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు ఉద్యోగులు వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేయడంతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని ఉద్యోగులు పద్మజారెడ్డి, రామాంజనేయులు, అనురాధ, రాజేష్ తదితరులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని ఆయన హామీఇచ్చారు.


సుంకులమ్మ ఆలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

నందవరం: జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని జగనన్న కాలనీల్లో సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు వంటి వసతులు కల్పించాలని కోరారు. అలాగే పేదలకు ఇంటి నిర్మాణానికి 1.50 సెంట్లు కాకుండా 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు రమేష్, తిప్పన్న, అర్జున్ రెడ్డి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ చలువతోనే పులికనుమ ప్రాజెక్టు

ఎమ్మిగనూరుటౌన్: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే పులికనుమ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందని, టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనడంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తేల్చిచెప్పారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో బీడు భూములకు సాగునీరందించాలనే ఉద్దేశంతో 2006లో సూగూరు రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో పులికనుమ ప్రాజెక్టు నిర్మాణం గురించి నాటి మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తాను స్వయంగా తీసుకెళ్లాన్నారు. దీంతో అప్పటికప్పుడు ప్రాజెక్టు మంజూరు చేస్తామని వైఎస్సార్ హామీ ఇచ్చారన్నారు. దీంతో పులికనుమ ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభమై తానే అధికారులతో అంచనాలు రూపొందించి పంపడంతో రూ.261 కోట్లను వైఎస్సార్ కేటాయించారన్నారు. ఈమేరకు 21-9-2008న పులికనుమ ప్రాజెక్టు ఎత్తిపోతల పథక నిర్మాణానికి ఎమ్మిగనూరు పట్టణంలో మహానేత వైఎస్సార్ పైలాన్‌తో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ఎల్లెల్సీ నుంచి పులికనుమ ప్రాజెక్టుకు కాలువ నిర్మాణం పూర్తిచేయలేకపోగా చివరి ఏడాదిలో కేవలం రూ.25 కోట్లు కేటాయించిందన్నారు. పులికనుమ ప్రాజెక్టు నేడు పూర్తయిందంటే అది దివంగత మహానేత వైఎస్సార్ చలవే అన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు సున్నం కొట్టి తామే పూర్తి చేశామని ప్రచారం చేసుకోవడం ప్రజలందరికీ తెలుసన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

పొలాల్లో జల సిరులు

తుగ్గలి: వ్యవసాయం దండగ కాదు, పండుగ అని సాటి చెప్పింది వైఎస్సార్ కుటుంబం. గత పాలకులు వ్యవసాయాన్ని పట్టించుకోకుండా రైతుల కంట కన్నీరు తెప్పించారు. రైతన్నల కష్టాల్ని పాదయాత్రలో స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పదవి చేపట్టిన తర్వాత వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేశారు. మండలంలో రెండో విడత కింద ఉచితంగా బోర్లు వేస్తున్నారు. మెట్ట పొలాల్లో వేసిన బోర్లలో జలాలు ఎగిసిపడుతుండడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కడమకుంట్లకు చెందిన రైతు తనకున్న 4 ఎకరాల్లో జలకళ కింద వేసిన బోరులో మూడు ఇంచుల నీరు పడ్డాయి. దీంతో ఆలస్యం చేయకుండా విద్యుత్ మోటారు అమర్చుకొని వేరుశనగ పంట సాగు చేశాడు. జలకళ బోర్లకు వెంటనే విద్యుతు సదుపాయం కల్పిస్తే మెట్ట భూముల్లో బంగారు పంటలు పండించవచ్చని జలకళ బోరు లబ్ధిదారులు కోరుతున్నారు.


కడమకుంట్ల వద్ద జలకళ బోరు నీటితో వేరుశనగ పంట వేసిన రైతు

డిప్యూటీ సీఎంను కలిసిన మైనార్టీ నాయకులు

హొళగుంద: రాష్ట్ర డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషాను ఆదివారం హొళగుంద మండలానికి చెందిన ముస్లిం మైనార్టీలు, పార్టీ నాయకులు వైఎస్సార్ జిల్లా కేంద్రంలో కలిశారు. పార్టీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఈశా, ఎల్లార్తి దర్గన్న, ఈరన్న, మైనార్టీ నాయకులు సాదిబాషా, హమీద్, మౌలానా, హబిబుల్లా, జబ్బర్, అనీస్, ఫాజిల్, అమిన్, సుభాన్, షఫి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. హొళగుందలో ముస్లిం శ్మశాన వాటికకు కాంపౌడ్‌వాల్, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


కడపలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషాను కలిసిన మైనార్టీ నాయకులు

చెరువు నీటి వృథాపై ఆందోళన

వెల్దుర్తి: మండల పరిధిలోని బోగోలు, వీరన్నగట్టు చెరువుల నుంచి నీటిని చేపల పెంపకందారులు తూముల ద్వారా వృథాగా బయటకు వదిలేస్తుండడంపై ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోగోలు చెరువులో చేపల పెంపకానికి హక్కులు దక్కించుకున్న వారి గడువు పూర్తయ్యిందని, అయినా చేపలు పట్టుకునేందుకు వేలందారుడు శనివారం రాత్రి తూము ద్వారా నీటిని బయటకు వదిలేశాడని ఆరోపిస్తున్నారు. చెరువులో నీరు తక్కువగా ఉంటే చేపలు పట్టుకునేందుకు అనువుగా ఉంటుదన్న దురాలోచనతో ఈ పనికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూముల ద్వారా నీటిని వృథాగా వదిలేయడంతో భూగర్భ జలాలు ఇంకిపోవడంతోపాటు, సమీప బోర్లలో నీరు తగ్గడం, పశుపక్షాదులకు నీరు కరువవుతుందంటున్నారు. వెల్దుర్తి వీరన్నగట్టు చెరువు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొందని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆయా చెరువుల కింద ఆయకట్టు సాగు లేకపోయినా నీటి వృథా మంచిది కాదంటున్నారు. చేపలు పట్టుకోదలచిన వారు ఉన్న నీటిలోనే వలలు వేసి పట్టుకోవాలని సూచిస్తున్నారు. బోగోలు గ్రామస్తులు తమ చెరువు తూములను ఆదివారం మూసివేశారు. నీటిని వృథా చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే వీరన్నగట్టు చెరువు అటవీ పరిధిలో ఉండడంతో సంబంధిత ఎఫ్‌బీఓ అబ్దుల్ కలాం మాట్లాడుతూ.. చెరువులో చేపల పెంపకం, అమ్మకానికి వేలాలు పూర్తికాగా చేపలు పట్టుకునేందుకు వేలందారుడు పూర్తి హక్కులు కలిగి ఉన్నాడన్నారు. అయితే రాబోవు వేసవిలో చెరువులోని చెట్ల తొలగింపు, పూడికతీత జరిగేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు, నీరు ఖాళీ కావడం ఆయా పనులకు దోహదపడుతుందన్నారు.


బోగోలు చెరువు తూము తెరవడంతో వృథాగా పోతున్న నీరు

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి


చైర్మన్ సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా గ్రంథాలయ సభ్యత్వం స్వీకరిస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఈ మేరకు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని స్వీకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. ఆదివారం పట్టణంలోని లైబ్రరీలో 'గ్రంథాలయాల అభివృద్ధి–ప్రజల భాగస్వామ్యం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రూ.100 చెల్లించి సభ్యత్వం స్వీకరించి గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వార్త పత్రికలు, మొదలుకొని నిరుద్యోగులకు పోటీ పరీక్షల మెటీరియల్ వరకు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి తెచ్చేందుకు డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీర శైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ ఇక్బాల్, గ్రంథాలయాధికారి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పొడిగింపుపై హర్షం

తుగ్గలి: రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నగిరి గుంతదేవి హర్షం వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు.

వాహనాల తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక చక్రాళ్ల రోడ్డు కూడలిలో ఆదివారం ఎస్ఐ గోపాల్ వాహనాల తనిఖీ చేపట్టారు. దారి వెంట వెళ్లే వాహనదారులను ఆపి లైసెన్స్, ఇతర రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు.

ముగిసిన శవాసప్ప స్వామి ఉరుసు

తుగ్గలి : చెన్నంపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శవాసప్ప స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. వేకువజామున గుర్రంపై పూలతో అలంకరించిన స్వామి షంషీర్‌ను ఉంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామికి కొబ్బరికాయలు కొట్టి తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు.

27న సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మద్దికెర: మండల పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈనెల 27వ తేదీ సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. 25వ తేదీ బుధవారం ఉదయం కలశస్థాపన, గణపతి హోమం, సాయంత్రం ప్రదోష పూజలు ఉంటాయన్నారు. అలాగే 26వ తేదీ గురువారం 8 గంటలకు లక్ష్మీనారాయణ హోమం సాయంత్రం క్షీర తర్పణం, పూజలు 27న శుక్రవారం సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఖరీఫ్ నాటికి రిజర్వాయర్‌లో నీరు నింపుతాం

ఆలూరు: వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి నగరడోణ గ్రామ రిజర్వాయర్ పనులను పూర్తిచేసి చెరువులోకి వివిధ కాలువల ద్వారా వర్షపు నీటిని నింపేందుకు కృషి చేస్తామని హెచ్ఎల్‌సీ ఈఈ రమణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడారు. రిజర్వాయర్ పనులు దాదాపు 50 శాతం పూర్తికావొచ్చాయన్నారు. ప్రస్తుతం స్లూయిస్, కాలువల రీడిజైన్, డీపీలు తదితరులు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. పనులు వేగవంతం చేసి మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు ఈఈ రమణారెడ్డి తెలిపారు.

నీటి సమస్య తీర్చండి

వెల్దుర్తి: మండల కేంద్రంలోని 4వ వార్డు ఏబీఎం చర్చి వద్ద గల వాటర్ ట్యాంకు కింది భాగం పగిలిపోయి నీరు స్టోరేజ్ అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆ వీధిలోని దాదాపు 30 కుటుంబాలకు నీటి సౌకర్యం తగ్గింది. పంచాయతీ వారు పగిలిపోయిన నీటి ట్యాంకు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయకపోగా మోటారు కనెక్షన్ సైతం కత్తిరించి వెళ్లారు. పది రోజులైనా తమ నీటి సమస్య తీర్చకపోగా, పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై వీధివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగిలిపోయిన ట్యాంకు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి, మోటార్ కనెక్షన్ ఇచ్చి నీటి సమస్య తీర్చాలని వీధివాసులు కోరుతున్నారు.


కింది భాగం పగిలిపోయి నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంక్

దేవరగట్టులో విశేష పూజలు

హొళగుంద: దసరా ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు స్వామివారి మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతితో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


మాళమల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా పామయ్య తాత తిరునాల

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో పామయ్య తాత తిరునాల ఆదివారం ఘనంగా జరిగింది. గురుశిష్యుల బంధానికి, బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం గ్రామాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీకగా ఈ తిరునాలకు పేరుంది. బొమ్మిరెడ్డి పల్లెకు చెందిన పామయ్య తాత శిష్యుడైన నార్లాపురం పెనికలపాటి హనుమంతయ్య వంశీయులు ఎడ్లబండ్ల ద్వారా తీసుకొచ్చిన నైవేద్యాన్ని తొలిగా సమర్పించారు. అనంతరం తాత వంశీయులైన బొమ్మిరెడ్డిపల్లె వారసుల పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం, అల్లుగుండు, మల్లెపల్లె, వెల్దుర్తి మండలంతో పాటు వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తాత సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకాలంకరణ, నందికోల సేవ, చెక్కభజనలు, తాత్కాలిక అంగళ్లలో కొనుగోళ్ల సందడితో తిరునాల కనుల పండుగగా జరిగింది. సర్పంచ్ సునీతా రెడ్డి, మధుసూదన్ రెడ్డి దంపతులు, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామయ్య తాత గుడి హైవే అనుకుని ఉండడం, తిరునాలతో కిక్కిరిసిన భక్త జనసందోహం పరిస్థితులలో వెల్దుర్తి, హైవే పోలీసులు తగు భద్రతా చర్యలు చేపట్టారు.

సీఎస్ఐ చర్చీల అభివృద్ధికి కృషి

ఆలూరు: రాయలసీమ జిల్లాల్లోని సీఎస్ఐ చర్చిల పరిధిలో కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని రాయలసీమ సీఎస్ఐ చర్చిల చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ఐసక్ వర ప్రసాద్ తెలిపారు. ఆలూరు సీఎస్ఐ చర్చి ఆవరణలో ఆదివారం పాస్టర్ దేవదానం ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన క్రైస్తవ మతస్తులను ఉద్దేశించి మాట్లాడారు. తాను బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి అభివృద్ధి పనులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసక్ వర ప్రసాద్ సతీమణి భారతి, రాయలసీమ దయాస్ చర్చీల కోశాధికారి మేరీ సుకుమార్, క్రైస్తవ మత పెద్దలు దేవసహాయం, ఏసురత్నం, రాజశేఖర్, సుందరరాజ్ తదితరులు బిషప్‌ను ఘనంగా సన్మానించారు.

నిరుపయోగంగా చెత్త తరలింపు రిక్షాలు

పత్తికొండ రూరల్: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన రిక్షా బండ్లు పత్తికొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా మూలకు చేరాయి. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు సబ్సిడీపై అందించడంతో పాటు గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు చెత్తను నిర్వహణ కేంద్రాలను తరలించేందుకు అందించిన వాహనాలు నిరుపయోగంగా మూలకు చేరడంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


పత్తికొండ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో మూలన చేరిన చెత్త తరలింపు రిక్షా బండ్లు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

హొళగుంద: స్థానిక కన్నడ ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లక్ష్మిరెడ్డి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెళగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దివ్యాంగుడైన సదరు టీచరు పని నిమిత్తం సిరుగుప్పకు వెళ్లి తిరిగి వస్తుండగా బెళగల్ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి ప్రమాదం జరగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ముక్కు, మొహం మీద రక్త గాయాలు కావడంతో స్థానికులు బంధువులకు సమాచారమిచ్చి 108లో ఆదోనికి తరలించారు.


గాయపడిన లక్ష్మిరెడ్డి →

త్యాగరాజ స్వామి సంగీత కచేరి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి సంగీత కచేరి జరిగింది. ఆదివారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో నాయిబ్రాహ్మణ సంఘం ఆర్గనైజర్స్ రామాంజనేయులు, హరిబాబు నేతృత్వంలో సంగీత కచేరి నిర్వహించారు. ఆంధ్రరత్న నేషనల్ అవార్డు గ్రహీత మాస్టర్ కాకర్ల ఈశ్వరయ్య చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది. అనంతరం ఈశ్వరయ్యను నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, ఆర్గనైజర్లు శాలువా, పూలమాలలు వేసి నగదు బహుమతితో సన్మానించారు. ప్రతిభ కనబరిచిన సక్సఫోన్, డోలు, తబల మాస్టర్లను సత్కరించారు. నాయకులు శాంతప్ప, వెంకటేష్, నరసింహులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

మద్దికెర: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్న వలంటీర్లపై పచ్చ మీడియా ఇష్టానుసారంగా రాతలు రాస్తూ దుష్ప్రచారం చేయడం తగదని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో లక్షణాలున్న వారికి సకాలంలో పరీక్షలు చేయించడమే గాకుండా, వ్యాప్తిని అడ్డుకునేందుకు వలంటీర్లు ప్రాణాలను ఫణంగా పెట్టి నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నాయన్నారు. ఇకముందు ఇలాంటి రాతలు రాస్తే ప్రజల్లో మరింత చులకన అవుతారన్నారు.

ముగిసిన శతజయంత్యుత్సవాలు


ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి


పురవీధుల్లో భజనలు చేస్తూ ఊరేగిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబా భవానీ ఆలయంలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి శతజయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి.. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామి,అమ్మవార్లకు వేకువజామున విశేష పూజలు, బంగారు వెండి ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపులో గోవిందా నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టా రేణుక ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా రుక్మిణీ పాండురంగస్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి పూజలు అనంతరం సన్మానించారు.